క్లుప్తంగా

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్‌రావు

కురిచేడు: లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక రాఘవేంద్ర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వీవీ రమణారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ సీహెచ్ హరి ప్రసాదరావు, వీజీడీ లక్ష్మీనారాయణ పాల్గొని నూతన అధ్యక్షుడు ఇందూరి వెంటనరిసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి యెలిశెట్టి రంగనాయకులు, కోశాధికారి పండేల ప్రసాదరావు, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పేద మహిళలకు చీరలు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌రావు, జెడ్పీటీసీ నుసుం నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో సమస్యల పరిష్కారానికి లయన్స్ క్లబ్ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, రీజినల్ చైర్మన్ జేబీ రామారావు, కోఆర్డినేటర్ మానం రామాంజనేయులు, జోన్ చైర్మన్ కోట హనుమంతరావు, దొనకొండ క్లబ్ అధ్యక్షుడు మల్లెల రామిరెడ్డి, ఎస్సై శివ, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లికి పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు: జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తూర్పుగంగవరం పంచాయితీ పరిధిలోని సోమవరప్పాడులో కొలువై ఉన్న గుంటి గంగా భవానీ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పూజారులు మెట్టిల బాలరాజు, పి.విజయలక్ష్మి అమ్మవారిని మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పుట్ట, నాగ శిలలు, మల్లికార్జున స్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

రూ.5కే టీషర్టు.. ఎగబడ్డ మహిళలు!

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని నెహ్రూ బజారులో ఓ దుస్తుల దుకాణం యజమాని 5 రూపాయలకే టీషర్టు అంటూ ప్రకటించడంతో ఆదివారం ఉదయం అధిక సంఖ్యలో జనం ఎగబడ్డారు. మహిళలు భారీగా రావడంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఒక్కో దఫా కొందరిని దుకాణంలోకి పంపి టీషర్టులు విక్రయించాల్సి వచ్చింది. నెహ్రూ బజారు మొత్తం మహిళలు, వినియోగదారులతో నిండిపోయింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లె, యర్రపల్లె గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహరించాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

మార్కాపురం: ఏపీ సీఆర్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో మార్కాపురంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ సూచించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో 2వ రోజు శిక్షణా తరగతుల్లో ప్రెస్ అకాడమీ తరపున హాజరైన పలువురు సీనియర్ జర్నలిస్టులు రిపోర్టింగులో పాటించాల్సిన జాగ్రత్తలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాలు, సోషల్‌మీడియా ప్రభావాలు తదితర అంశాలపై మాట్లాడారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్ తదితరులు మాట్లాడిన అనంతరం శిక్షణ పొందిన పాత్రికేయులకు సర్టిఫికెట్లు అందించారు.



నిమజ్జనానికి తరలి పోతున్న గణేష్ విగ్రహం



కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

వినాయకా వీడ్కోలు

- కోలాహలంగా గణేష్ నిమజ్జనోత్సవాలు



పెద్దారవీడులో వినాయక నిమజ్జనోత్సవం



పెద్దదోర్నాల సుందరయ్య కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడు



శ్రీశైలానికి తరలి వెళ్తున్న కొర్రప్రోలు గిరిజన గూడెం గణేషుడు

యర్రగొండపాలెం: స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్, అమ్మవారిశాల వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ఆదివారం పట్టణంలో భారీ ఎత్తున ఊరేగించి త్రిపురాంతకంలోని నాగార్జున సాగర్ కాలువలో నిమజ్జనం చేసేందుకు తరలించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కొలుకుల సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహం వద్ద మహిళలు కోలాహలంగా కోలాటం వేసి ప్రజల మన్ననలు పొందారు. ముందుగా మహిళలు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు.

వినాయకస్వామి నిమజ్జనం

పెద్దారవీడు: మండలంలో పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. పెద్దారవీడు గ్రామంలో ఐదు రోజుల పాటు వినాయకస్వామి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మేడవరం రాఘవేంద్ర వినాయక స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం సాయంత్రం గ్రామంలో నిమజ్జనం ఊరేగింపు ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి వేలం పాటలో వినాయకస్వామి చేతిలోని లడ్డు అల్లు గోపిరెడ్డి రూ.20 వేలు, కలశం అల్లు కృష్ణారెడ్డి రూ.2 వేలకు దక్కించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు అందరినీ అలరించాయి. పోటీలో విజేతలకు తగిన బహుమతులు కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. ఊరేగింపు అనంతరం ఊరి చివర ఉన్న చెరువులో వినాయకున్ని నిమజ్జనం చేశారు.



వైపాలెంలో కోలాటం వేస్తున్న మహిళలు

నిమజ్జనానికి భారీగా తరలి వెళ్లిన గణనాథులు

పెద్దదోర్నాల: మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులు ఆదివారం నిమజ్జనానికి తరలి వెళ్లాయి. ఆదివారం మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీ, శ్రీరంగ హాస్పిటల్, వెచ్చా వెంకట సుబ్బయ్య వీధి, అయినముక్కల, కొర్ర ప్రోలు గిరిజనగూడెం, చిన్నదోర్నాల, నాయీ బ్రహ్మణ వీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. పలు ప్రాంతాల్లో గణేష్ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మూడు పనులు.. ముప్ప తిప్పలు!

- తాళ్లూరు ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు అదనపు బాధ్యతలు అప్పగింత
- పంచాయతీ పాలనపై కొరవడిన పర్యవేక్షణ



తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయం

తాళ్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా పంచాయతీ పాలనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఇతర సిబ్బంది నియామకాలను గాలికొదిలేసి ఉన్న వారితోనే నెట్టుకొచ్చేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతుండటం విమర్శలకు తావిస్తోంది. తమపై పనిభారం పెరిగిపోతోందని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నా వారి మొర ఆలకించే నాథుడు కరువయ్యారు. తాళ్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓను ప్రభుత్వం నియమించకుండా ఏఓగా విధులు నిర్వహిస్తున్న సానికొమ్ము సత్యంకి ఎంపీడీఓ(ఎఫ్ఏసీ), ఈవోఆర్డీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పంచాయతీలపై ఆయన పర్యవేక్షణ కరువైంది. ఓ పక్క రివ్యూ మీటింగ్‌లకు హాజరుకావాల్సి ఉండటం, మరోవైపు ప్రభుత్వం చేపట్టిన వివిధ సర్వేలు పూర్తి చేయించాల్సి రావడం, ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ప్రజా ప్రతినిధులకు సంబంధించిన పనులు.. ఇలా అన్నీ తానై చేయాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. రెగ్యులర్ ఎంపీడీఓను నియమించి గ్రామాల్లో ఇబ్బందులను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అడిగొప్పలలో ఎమ్మెల్యే తాటిపర్తి ప్రత్యేక పూజలు



అడిగొప్పల ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పల్నాడు జిల్లా దుర్గి మండలంలోని అడిగొప్పల అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, పెద్దారవీడు మండలం నాయకుడు ఏలూరి నారాయణరెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిగొప్పల శ్రీలక్ష్మి నీలంపాటి అమ్మవారి ఆలయంలో ఆయన పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుగ్గెంపూడి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా మోసం

కురిచేడు: అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబునాయుడి నైజమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యన్నాబత్తిన వెంకటసుబ్బయ్య విమర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని ఆవులమంద, పడమర కాశీపురం, బోధనంపాడు, పొట్లపాడు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంతమందికి అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేసి తమ సొంత ఎజెండాను అమలు చేస్తోందన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో లెక్కకు మించిన హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. 16 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తోందన్నారు. నియోజకవర్గంలో అవినీతి రాజ్యమేలుతోందని, ప్రజా సమస్యలు గాలికి వదిలేసి అక్రమ మార్గంలో సంపాదనే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



చంద్రబాబు మోసపూరిత హామీలపై క్యూఆర్ కోడ్ చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ అభివృద్ధిపై దృష్టి సారించండి




అన్నా రాంబాబును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ సీపీలో నూతనంగా పదవులు పొందిన వారు పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. మార్కాపురం పట్టణంలోని వివిధ వార్డులకు కమిటీ అధ్యక్షులుగా పలువురిని నియమించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సలీమ్‌తో కలిసి నూతనంగా ఎన్నికైన వార్డు అధ్యక్షులు ఆదివారం అన్నా రాంబాబు నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కాపురం పట్టణంలో పార్టీ పటిష్టతపై అందరూ దృష్టిసారించాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, సతీష్, శ్రీను, రఫీ, జాకీర్, ఇస్మాయిల్, కరీముల్లా, భాను, బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


తపాలా ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

పొదిలి: భారతీయ తపాలా ఉద్యోగుల సంఘం (గ్రూప్ సి) మార్కాపురం డివిజన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.రవీంద్ర, సయ్యద్ ఇమామ్, ఉపాధ్యక్షులుగా విశ్వరూపరాణి, ఎం.రాజశేఖర్, డిప్యూటీ సెక్రటరీగా ఎ.శివశంకర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీలుగా కె.సాయిరాం, డీజే పాల్, ఎస్‌కే రసూల్, కె.ప్రసాద్, ఎల్.వెంకటరావు, కోశాధికారిగా శేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్నికైన ఎస్‌కె బాజీబీ, ఆర్ సునీత, రాజేష్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజనల్ సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు, సంఘ రాష్ట్ర కార్యదర్శి వెంకయ్య హాజరయ్యారు.

ప్రమాదకరంగా చప్టాలు



కాలేజీకి వెళ్లే దారిలో కుంగిపోయిన చప్టా వద్ద పెట్టిన డ్రమ్ము

కంభం: మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలో పలు చోట్ల కాల్వల చప్టాలు, వాల్వు గుంతలు, ఇరిగేషన్ కాల్వల అంచులు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలేజ్ రోడ్డులో డ్రైనేజి కాలువ చప్టా పది రోజుల క్రితం ఓ వైపు కుంగిపోగా డ్రమ్ము అడ్డుగా పెట్టి వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కంభం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న రెండు డ్రైనేజీ చప్టాలు పూర్తిగా కుంగి పోగా వాటిపై రెండు బస్సు టైర్లు పెట్టి వదిలేశారు. దీంతో బస్సులు మలుపు తిప్పుకొనేందుకు ఇబ్బందికరంగా మారింది. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా ఆర్టీసీ అధికారులు కానీ పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కంభం బస్టాండులో కుంగిన చప్టాల వద్ద పెట్టిన టైర్లు

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వర్షానికి పంటపొలాలు జలమయం

కంభం: శనివారం రాత్రి మండలంలో పలు చోట్ల కురిసిన వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. తురిమెళ్ల, యర్రబాలెం సమీపంలోని పంటపొలాల్లో వర్షం నీరు భారీగా నిలిచిపోయింది. పొలాల్లో నువ్వుల ఉడ్డలు తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి చేలల్లో వర్షం నీరు నిలిచిపోయింది. గత రెండు రోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి గుండ్లకమ్మ వాగు ఉధృతి పెరిగి కంభం చెరువుకు నీరు చేరుతోంది. ప్రస్తుతం కంభం చెరువులో 7 అడుగుల మేర నీరు ఉంది.



యర్రబాలెం వద్ద కంభం వైపు ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు



తురిమెళ్లకు వెళ్లే మార్గంలో జలమయమైన పంటపొలాలు



తురిమెళ్ల సమీపంలో పంట చేలో నిలిచిన వర్షం నీరు



వర్షానికి తడిసిపోయిన నువ్వుల ఉడ్డలు